# ప్రణయలీల

శ్రీమతి జె కౌసల్యాదేవిగారు

వెన్నెలకాంతిలో ఆ నదీతరంగాలు వింతగా మెరుస్తున్నాయి. ఒడ్డు నొరసికొని ఏమో అవ్యక్త మధురకలస్వనం చేస్తున్నాయి. దూరాన కొండలు ఆకాశాన్నంటుతూ ప్రశాంతంగావున్న ప్రకృతికి గాంభీర్యాన్నిస్తున్నాయి. చల్లనిగాలి వీస్తూ వెన్నెలను మరింత ఆర్ద్రం చేస్తోంది.

నదీతీరాన రాజేశ్వరి, చంద్రమోహన్ కూర్చుని వున్నారు. అతిలోక రమణీయమైన ప్రకృతి సౌందర్యామృతాన్ని రెప్ప వాల్చకుండా ఆస్వాదిస్తున్నారు.

ఇద్దరూ ఒకరినొకరు అయిదేళ్లనుంచి ఎరుగుదురు. అతనికి బాల్యంనుంచీ నాట్యంఅంటే ఆసక్తి. ఇంటర్మీడియేట్ వరకు చదివాడు. ఆ తర్వాత చదువు సాగలేదు. తండ్రి అనుమతి తీసుకొని ప్రొఫెసర్ రాజకమల్ నాట్యనికేతనంలో చేరాడు.

రాజేశ్వరి వివాహిత. అయితే ఆమె భర్త చండశాసనుడు. ఆమెను అనేకవిధాల హింసించాడు. ఆ బాధలను అనుభవించ లేకపోయింది. భర్తను వదిలిపెట్టింది. తిన్నగా రాజకమల్ నాట్యనికేతనానికి వచ్చిచేరింది.

ఉభయులకు నికేతనంలోనే తొలిపరిచయం. రాజకమల్ శిక్షణలో ఇద్దరూ అపూర్వమైన నాట్యకౌశలాన్ని అలవరుచుకొన్నారు. పెద్దపేరు సంపాదించుకొన్నారు.

అతనికి 25 ఏళ్లు. ఆమెకు 23 ఏళ్లు. అయితే ఆమె అంత వయస్సున్నట్లు కనిపించదు. 17 లేక 18 ఏళ్లప్రాయంలో వున్నట్లుగా కనిపిస్తుంది. ఇద్దరు ఒకరి నాట్య కౌశలానికి ఒకరు ముగ్ధులౌతూవుంటారు. రంగస్థలంమీద ఇద్దరు ఒకరికొకరు చూసుకొని అత్యంతమైన ప్రేమతో లోకోత్తరంగా నాట్యంచేసి ప్రేక్షకులకు పారవశ్యం కలిగిస్తూ వుంటారు.

నాటిరాత్రి ప్రశాంత మనోజ్ఞమైన ప్రకృతినిచూస్తూ ఇద్దరూ ఏవేవో స్వప్నాలు కంటున్నారు. ఇంతలో "చంద్రమోహన్" అని ఎవరో పిలిచినట్లయింది. రాజేశ్వరీ చంద్రమోహన్‌లు ఉలికిపడ్డారు. వారి ఆచార్యుడు ప్రొఫెసర్ రాజకమల్ దగ్గరకువచ్చి కూర్చున్నాడు.

"నీతో మాట్లాడవలసిన పనివుండే ఇలా వచ్చాను" అన్నాడు రాజకమల్.

"చెప్పండి" అన్నాడు చంద్రమోహన్. రాజేశ్వరి ఉత్కంఠతతో అదేమో వినడానికి ఉత్సుకురాలయింది.

"వంగదేశంలో మనం ఇవ్వబోయే ప్రదర్శనలమాటే నేను యోచిస్తున్నాను. నికేతనం విద్యార్థులందరిలోను మీ ఇద్దరే మిన్నలుగా వున్నారు. రాజేశ్వరి నిన్నుకూడా కొన్ని సందర్భాలలో మించుతుందని..."

"ఆమె పార్వతి కదండీ."

"అవును. అదంతా నాకు తెలుసు. నాకు రాజేశ్వరి విషయమై బెంగలేదు. నీమాటే నాకు దిగులు కలిగిస్తున్నది. నీకు అందముంది. హావభావ ప్రకటన సమర్థతవుంది. అంగవిన్యాసం బాగుంటుంది. అయితే నీ నాట్యంలో ఒక్కటే లోపం."

"ఏమిటది ?"

"ఆత్మానుభూతి. ఆ అనుభూతి లేకపోవడంవల్లనే నువ్వు రంగస్థలంమీద ఏదో "డ్రిల్లు" చేస్తూ పాఠం అప్పగిస్తున్నట్లుంటుందేగాని—ప్రేక్షకుల హృదయాలను కదిలించలేకపోతున్నది. నీకు ఆత్మానుభూతి వుంటేనే ప్రేక్షకులకు రసానుభూతి. నాట్యం మానవుని భౌతిక విషయాసక్తిని తప్పించి ఆధ్యాత్మికోన్నతిని ప్రాపింపచేయగల మహత్తర సాధనం. నాట్యం చేస్తున్నపుడు దానిలోని భావాన్ని అనుభవించాలి. అప్పుడే ఆ నాట్యానికి సార్థకత. అప్పుడే రససిద్ధి. భావాన్ని అనుభవించడానికి నీకు హృదయం వుండాలి. అయితే ఎప్పుడైనా ఏ కష్టమైనా సంభవించినపుడు బాధ పడ్డావా ?"

"ఇంతవరకు నాకు దుఃఖం అంటే ఏమో తెలీదు మహానుభావా!"

"అవును. నేనుకూడా అలాగే అనుకున్నానులే. బాధానుభవంలేదు. అదే ఈ చిక్కుకు కారణం."

* * *

ప్రధాన నగరాల పర్యటనకు రాజకమల్ అన్ని ఏర్పాట్లు చేశాడు. పత్రికల్లో ప్రకటనలు-నగరంలోని గోడలమీద పోస్టర్లు, కరపత్రాలు-బ్రహ్మాండంగా ప్రచారం జరిగింది.

చంద్రమోహన్‌కు కొన్ని 'సోలో' డాన్సులు, రాజేశ్వరితో డ్యూయట్లు ప్రత్యేకించబడ్డాయి. పర్యటనలో కలిగే విజయంపైనే తనభావి ఆధారపడివుందనుకున్నాడు చంద్రమోహన్. నికేతనంనుంచి ఈ పర్యటననుగురించే ఏదో ఆలోచించుకొంటూ నదీతీరందాకా నడిచివచ్చాడు. ఏడుగంటలు కావచ్చింది. నదీతీరం నిశ్శబ్దంగావుంది. వెన్నెల పిండి ఆరబోసినట్లుంది. అయితే చంద్రమోహన్ మనస్సుమాత్రం చింతా వ్యాకులితమైవుంది.

రాజేశ్వరి తనూ ఆనాటి మధ్యాహ్నమే ఎందుకో తగవు పడ్డారు. అప్పుడప్పుడు ఒకరిమాట ఒకరికి నచ్చక వాదించుకోవడం-తిరిగి వెంటనే మాట్లాడుకోవడమూ జరుగుతూనే వుంది కాని ఈసారి అతనికి ఎంచేతనో ఆందోళనగావుంది. ఇద్దరికీ మామూలుగావలె సామరస్యం కుదిరదేమో అనిపించింది.

ఇలా యోచించుకొంటున్న సమయంలోనే ఒక నడివయస్కుడైన వ్యక్తివచ్చి "ఏమండీ! ప్రొఫెసర్ రాజకమల్‌జీ నాట్యనికేతనానికి దారి ఎలాగ?" అని అడిగాడు.

"అదే" అని చంద్రమోహన్ ప్రశ్నార్థకంగా చూశాడు.

"నికేతనంలో నా భార్యవుంది. ఆమె పేరు ఉమ. రాజేశ్వరి అన్నపేరుతో మసలుతూ వుందని విన్నాను."

"ఆమె మీ భార్యా?" అన్నాడు చంద్రమోహన్ ఆశ్చర్యంగా.

"అవును. ఆమెను మీకెరుగుదురా?"

"ఆఁ! ఎరుగుదును-ఇదేదారి వెళ్లండి" అని చంద్రమోహన్ ముందుకు నడిచాడు. అతని హృదయం క్రుంగిపోయింది. అయిదేళ్లకు పిమ్మట ఇతడు తిరిగి ఎందుకు వచ్చినట్లు? రాజేశ్వరిని తీసుకొనిపోతాడా? అతనికేమీ తోచలేదు. రాత్రి తొమ్మిది తొమ్మిదిన్నరకు తిరిగి నికేతనానికి వచ్చాడు. ఆరాత్రి భోజనం చెయ్యలేదు. తన గదిలోకి వెళ్లి పడుకున్నాడు. తెల్లవారగానే ప్రయాణం. రాజేశ్వరి కనిపించలేదు. భర్త ఆమె ఏం చేస్తున్నారో—ఆమె నతడు ఏం వేధిస్తున్నాడో అని ఆరాటం-ఆవేదన తుపాను రేపాయి అతని హృదయంలో.

ఈ తలపులలోనే అతనికి కలతనిద్రపట్టింది. హాలులోని గోడగడియారం టిక్ టిక్ అన్న ధ్వనితప్ప మరే సవ్వడీ లేక అతి నిశ్శబ్దంగా వుంది. ఇంతలో హాలులోని లైట్లు తటాలున వెలిగాయి. రాజేశ్వరీ! రాజేశ్వరీ అని ప్రొఫెసర్ రాజకమల్ ఆదుర్దాగా పిలుస్తూ చంద్రమోహన్ గదిలో చొరబడి "మోహన్! రాజేశ్వరి—ఇలా రాలేదా" అని అడిగాడు.

"నాకు కనబడనేలేదు స్వామీ."

"ఎక్కడకు వెళ్లింది? భర్త ఆమె గదిలో చనిపోయి వున్నాడు. ప్రక్కనే విషం పొట్లం వుంది. ఆమె ఏమైందీ తెలియడంలేదు. ఘోరం."

"ఆమె తన పతినే చంపివేసిందా?" అంటూ తొందరగా చంద్రమోహన్ ఈవలకువచ్చాడు. అతడు-రాజకమల్‌జీ రాజేశ్వరి గదిలోకి వెళ్లారు. తాను ఆ సాయంకాలంచూసిన వ్యక్తి సోఫాదగ్గర క్రిందపడివున్నాడు.

టేబుల్ మీద ఏదో చీటి కనిపించింది. ఎవరో ఒక విద్యార్థి దానినిచూసి చంద్రమోహన్ కిచ్చాడు.

ఆత్రంగా అతడు ఆ చీటీని చదువుకొన్నాడు.

"ప్రియా! నన్ను క్షమించు. మన ఘర్షణతో నా చిత్తం వికలమైపోయివున్న సమయంలోనే నా భర్తవచ్చి తనతో తిరిగిరమ్మని పేచీపెట్టాడు. నేను తిరిగి ఆ నరకానికి వెళ్లలేక-ఈ సాహసానికి ఒడిగట్టాను. ఆయనకు కాఫీలో విషం

కలిపి ఇచ్చాను. నేను నదిలో పడిపోతున్నాను. నువ్వు ఈ చీటీ చూసుకొనేసరికే నేను పరలోకంలో వుంటాను. నేనెప్పుడైనా జ్ఞాపకంవస్తే-నదీతీరానికివచ్చి పిలు. నా ఆత్మ అయినా నీ పిలుపువిని సంతోషిస్తుంది. మనం ఎప్పటికైనా అమరలోకంలో కలుసుకోగలం. సెలవా?

—నీ రాజేశ్వరి."

ఈలేఖ చదవగానే అతనితల గిర్రున తిరిగింది. శిరస్సుపై పిడుగు పడ్డట్లయింది. హృదయంలో—ఎన్నడు ఎరుగని సంక్షోభ బయలుదేరింది.

అతడు నదీతీరానికి పరుగెత్తాడు. రాజేశ్వరీ అని ఎలుగెత్తి పిలిచాడు. ఆ నీరవనిశీధినిలో అతని పిలుపే నలుమూలలనుంచి ప్రతిధ్వనించింది. దుఃఖోద్విగ్నమైన చిత్తంతో నికేతనానికి తిరిగివచ్చాడు.

అతని హృదయం ఇప్పుడంధకారబంధురం. లోకం అతనికి మరుభూమి.

* * *

ఆనాడు కలకత్తాలోని కొరిన్‌థిన్ థియేటర్‌లో నాట్య నికేతనంవారి ప్రదర్శన. అంతర్జాతీయ విఖ్యాతినొందిన రాజకమల్ నాట్యబృందంరాక-నగరంలో అత్యుత్సాహాన్ని ప్రదీపించింది. హాలు కిటకిటలాడి పోతూ వుంది.

ప్రదర్శన ప్రారంభమయింది. ఒక్కొక దృశ్యమే పూర్తి కాసాగింది. తుది దృశ్యం ప్రణయలీల. అది రాజేశ్వరీ చంద్రమోహన్‌ల మధుర ప్రణయగాథ. ఆ విషాదోదంతాన్నే ఒక నాట్యనాటికగా ప్రొఫెసర్ రాజకమల్ రచించాడు.

రాజేశ్వరిగా శాంత అనే యువతి రంగంమీదికి వచ్చింది. ఆమెను చూడగానే చంద్రమోహన్‌కు రాజేశ్వరి రూపం మనోవీధిని కనబడింది. శాంతలోనే అతడు రాజేశ్వరి దివ్య సుందరమూర్తిని అధ్యారోపించుకొన్నాడు. అతని హృదయం నవోత్సాహ సంభరితమయింది. నేపథ్యంలోని జంత్ర వాద్యాల సుమధురధ్వనులు లయకాగా ఇద్దరు మహోజ్వలంగా నాట్యం చేశారు.

తరవాత ఇద్దరు తగువుపడ్డారు. ఆమె విషాద విహ్వలయై అక్కడనుంచి దూరానవున్న నదీతీరానికి వెళ్లింది. నిరాశగా చూసింది. నదిలోనికి ఉరికింది. ప్రకృతి చలించింది. మహోగ్రస్వరూపంతో చెట్లు ఊగిసలాడినట్లు—తుపాను రేగినట్లు నదీజలంలో సుడిగుండాలు తిరిగినట్లు జంత్రవాద్యాలు—"సీనిక్ ఎఫెక్ట్సు" ప్రేక్షకుల హృదయస్పందనాన్నికూడా నిలిపివేశాయి. చంద్రమోహన్ పశ్చాత్తాపంతో లేచాడు. హృదయాన్నిదహిస్తున్న ఆవేదనను అతని నాట్యంలోని అంగవిన్యాసం-ముఖలక్షణంలో సూచించి, ప్రేక్షకుల హృదయాలను దుఃఖమగ్నం చేయసాగాయి. అతని ప్రతి అడుగు - ప్రతిముద్ర - ప్రతి అంగుళివిన్యాసం-ప్రతిభంగిమం ప్రణయవియోగ విహ్వలతను స్ఫురిస్తూ ప్రేక్షకుల నేత్రాలను విచార బాష్పాకులం చేశాయి.

అతడు మోకరించాడు. భగవంతుణ్ణి ప్రార్థించాడు. ఒక్కసారి లైట్లు ఆరిపోయి వెలిగాయి. ఆ ప్రార్థన ఫలించినట్లు-రంగస్థలంలో మరొకమూలనుంచి ఒక దివ్య సుందర విగ్రహం మెల్లగా మాలతీలతవలె ఊగులాడుతూ ముందుకు రాసాగింది. చంద్రమోహన్ చూశాడు.

"ఆఁ!" అని ఆశ్చర్యం విభ్రాంతి పొందాడు. ఇది నిజమా అనుకొన్నాడు. ఆమె శాంతకాదు. రాజేశ్వరి.

"రాజేశ్వరీ" అని అనబోయాడు. అతని నోటినుంచి మాట పైకి పెకలలేదు.

"అవు" నన్నట్లు ఆమె తల పంకించింది. "ఊఁ! గోఆన్‌ప్లీజ్" అని సైడ్‌కర్టెన్ వెనకనించి రాజకమల్ జీ అన్నాడు.

తన హృదయాధిష్ఠానదేవత-తన రాజేశ్వరి ఆకస్మిక సమావేశం కారణంగా చంద్రమోహన్ హృదయంలో ఆనందం వెల్లి విరిసింది. మహోద్వేగంతో అతని తనులత ఊగిపోయింది.

ఎంత సంతోషంలో-ఎంత ఉత్సాహంతో ఇద్దరు ఒకరినొకరు చూసుకొని నాట్యంచేశారో చెప్పలేము-ప్రేక్షకులు పరవశులై పోయారు.

ఇది అమరనాట్యంగానీ మానవనాట్యం కాదన్నారు. హర్షధ్వానాలతో హాలు మార్మ్రోగింది. తెరవాలింది.

*　　　*　　　*

" నువ్వు మరణించలేదా ? "

" లేదు."

" నీ భర్త ?—"

" ఆయన నా భర్తకాదు. ఆచార్యుని మిత్రుడు. ఆయన కూడా మరణించలేదు."

" మరి నువ్వు ఎలా తిరిగివచ్చావు ? "

" అంతా రాజకమల్ జీ ఆడిన నాటకం. ఆత్మానుభూతి అంటే—బాధానుభవమంటే ఏమో నీకు ఇప్పుడైనా బోధ పడిందా ? "

*　　　*　　　*

తెరలేచింది. ప్రేయసీప్రియులనుచూసి ప్రేక్షకులు హర్ష ధ్వానాలు చేశారు.

రాజేశ్వరి చంద్రమోహన్‌లు " సంధ్యారాగం " అనే నాట్యాన్ని అత్యంత మనోహరంగా ప్రదర్శించారు. ప్రేక్షకులకు నమోవాకాలు సమర్పించారు. తెర క్రిందికి జారింది. రాజకమల్ ముఖం సంతృప్తితో వికసించింది.

★




యునైటెడ్ కెమికల్ డైమండ్ వర్క్స

Head Office　　　Branch
తిరుచినాపల్లి　　　రంగూను

చంద్రా క్వాలిట్టి డైమండ్స తయారు చేయువారి
నూతనమైన రంగూను తయారింపు

BEAUTY OF ORNAMENTS




అసలు
రవ్వల మోస్తురు
ప్రకాశించును

UNITED CHEMICAL DIAMOND WORKS

Available in your places from all diamond merchants

Proprietors
మోతి. R. శ్రీరాములు శెట్టి
M S. కృష్ణమూర్తి శెట్టి
N ఆదినారాయణ శెట్టి
N రంగరాజులునాయుడు